PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 355 పేజీలు - 08 బుధవారం 18 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు.. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పు

- ఈ నెలలోనే మూడో తుపాన్ ముప్పు.. 19 నాటికి తీవ్ర తుపాన్‌గా అక్వాన్


2లో

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

- అంతర్జాతీయ చట్టాల గౌరవానికి దేశాల పిలుపు..
సముద్ర భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారంపై సంయుక్త ప్రకటన



2లో

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

- నామినేషన్ల సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలి.. భద్రత కోరుతూ వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం



2లో



పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

- చేయూత పింఛన్లతో వృద్ధులు, నిరుపేదలకు అండ.. సత్తుపల్లిలో పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

తొలి అక్షరం/సత్తుపల్లి,నవంబర్ 17: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెద్దలకు అండగా, పేదలకు తోడుగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని, సన్నబియ్యం పథకంతో పేదల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో మిగతా2లో...

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

- బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి..
త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 17: ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం రాయ్‌పూర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, తెలంగాణకు కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా, 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. భూసేకరణ, పరిహారం, పునరావాసానికి మిగతా2లో...

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

- కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ విమర్శలు..
మూడేండ్ల పాలనలో సాధించింది శూన్యమని వ్యాఖ్య



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 17 : సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'లో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీనే అని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదని, ప్రజల పోరాటం, కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితమని పేర్కొన్నారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే ప్రభుత్వ సాధనగా అభివర్ణించారు.రాష్ట్రానికి మిగతా2లో...

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..
19న సిద్దిపేట సభలో దరఖాస్తు విడుదల


2లో



2లో

పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

- అధికారుల మధ్య ఏకాభిప్రాయం..
పదోన్నతుల ప్రక్రియ వేగవంతం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 17: పోలీసు అధికారుల పదోన్నతులకు సంబంధించి ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలపై ఉన్న అభ్యంతరాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నిర్ణయించారు.

మిగతా2లో...

రైతుల కష్టాలు పట్టవా?

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని ఇక్కట్లు
- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోళ్లు లేవు..
వేగవంతం చేయాలని హరీశ్‌రావు డిమాండ్



తొలి అక్షరం/కల్వకుర్తి,నవంబర్ 17: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిగతా2లో...

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

తొలి అక్షరం/మనీలా,నవంబర్ 17: ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో కలిసి ముందుకు సాగాలని తూర్పు ఆసియా దేశాలు సంకల్పించాయి. మనీలాలో మంగళవారం ముగిసిన తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు అనంతరం 'స్థిరమైన భవిష్యత్తు, పునరుద్ధరణ కోసం కలిసి ముందుకు' అనే శీర్షికతో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సముద్ర భద్రత, వాణిజ్య ఆంక్షలు, పెరుగుతున్న ధరలు, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి కీలక అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చాయి.ఆసియాన్ దేశాలతో పాటు భారత్, అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. 1982లో కుదిరిన ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందాన్ని గౌరవించాలని నేతలు స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర వాణిజ్యం, నౌకాయానం, గగనతల ప్రయాణ స్వేచ్ఛను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.సముద్ర వనరులు, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సంరక్షణతో పాటు సముద్ర కాలుష్యం, వ్యర్థాల నివారణకు పరస్పర సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సముద్రగర్భంలోని కేబుళ్లు, పైప్‌లైన్లు, కీలక మౌలిక



సదుపాయాలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. **ధరల నియంత్రణకు వాణిజ్య మార్గాలు** నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో కొరత ఏర్పడకుండా వాణిజ్య మార్గాలను తెరిచి ఉంచాలని దేశాలు నిర్ణయించాయి. కీలక ఖనిజాలతో సహా సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునేలా అభివృద్ధి చేయాలని పేర్కొన్నాయి. వాణిజ్య సమస్యలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాయి. వాయు, భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానాన్ని విస్తరించడంతో పాటు ఇంధన రంగంలో సహకారాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చాయి.డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. ఆన్‌లైన్ మోసాలు, మనుషుల అక్రమ రవాణా, ఇంటర్నెట్ ద్వారా జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ వంటి నేరాలను అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నాయి. ముఖ్యంగా పిల్లలు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాయి.ఇంధన, ఆహార భద్రత, ఆరోగ్య వ్యవస్థల స్థిరత్వం, విపత్తుల సన్నద్ధత, సహాయక చర్యలు, వలస కార్మికుల రక్షణ వంటి అంశాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేయాలని నేతలు నిర్ణయించారు. **శాంతియుత ఇండో-పసిఫిక్ లక్ష్యం: మోదీ** శాంతియుతమైన, సుస్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో చర్చలు, దౌత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.**నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ** సమ్మక్క సాగర్ బ్యారేజీ ద్వారా ఎస్సారెస్పీ రెండో దశ కింద నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్పపాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించింది. బ్యారేజీకి అనుమతులు లభిస్తే ఈ ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరనుంది. **ముంపు తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతం మార్పు** సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. దీంతో ముంపును తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని అంచనా వేశారు. ఈ అధ్యయన నివేదికను ఐఐటీ ఖరగ్‌పూర్ జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.88 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే చెల్లించింది. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అనుమతుల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 17: రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న వివిధ బీమా పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దరఖాస్తులను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ కొత్త పథకం అమలుతో నష్టపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.**మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.
ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి మానిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను రూ.40 వేల కోట్ల వ్యయంతో మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శకంగా 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామకాలు చేపట్టామని చెప్పారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన ఆసరా పింఛన్లను దీపావళి నాటికి అర్హులైన మహిళలు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కులవృత్తుల వారికి కొత్తగా మంజూరు చేశామని తెలిపారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం** కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో గత 33 నెలల్లో రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, కమిషనర్ కోండ్ర నరసింహ, ఎంపీడీవో రావెళ్ల చిన్న నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

నారాయణఖేడ్ పర్యటనలో భాగంగా నిజాంపేటలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని అన్నారు.
కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు.
సాగుకు సరిపడా విద్యుత్, నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, పండించిన పంటను కూడా సకాలంలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, బార్‌దాన్, గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించి కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 17: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడుతుండటంతో మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికే అర్నాట్, మురసు తుపాన్లు రాగా, తాజాగా మూడో తుపాన్ రానుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి 'అక్వాన్'గా నామకరణం చేశారు. సముద్రంలో మేఘాలు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలుగు రాష్ట్రాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఇన్‌సాట్-3డీఎస్, ఇన్‌సాట్-3డీఆర్ ఉపగ్రహ చిత్రాల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో భారీగా మేఘాలు ఏర్పడినట్లు గుర్తించారు. అక్వాన్ తుపాన్ నవంబర్ 19 నాటికి మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.**20న తీరం దాటే అవకాశం**ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించారు. తుపాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు** సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 17:
రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని పోలీసులకు స్పష్టం చేసింది. భద్రత కోరుతూ అభ్యర్థులు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపిన వినతులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మండవ కిరణ్మయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు భద్రత కోరుతూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వి. సాయికుమార్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి, కొమ్మారెడ్డి దివాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కోర్టుకు తెలిపారు.ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని పిటిషనర్లు ఆరోపించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం.. ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగాలు తగ్గుతున్నాయని, భూముల ధరలు పడిపోతున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ నగరంలో నీటి కొరతకు నిదర్శనమని అన్నారు.22ఏ పేరుతో భూములను బ్లాక్ చేయడం, హైడ్రా పేరుతో కూల్చివేతలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింటోందని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లపై చర్యలు తీసుకుంటూ పెద్దల అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ నిర్వహించిన భారత్ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని, దానికి ఖర్చు చేసిన నిధులను ప్రజల అవసరాలకు వినియోగించి ఉంటే బాగుండేదని అన్నారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు తగిన సహాయం అందడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌ల సివిల్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పదోన్నతుల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సీనియారిటీ వివాదాలు, రోస్టర్ పాయింట్లు, ఖాళీలపై చర్చించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని డీజీపీ సూచించారు.**తొలిదశలో 54 అదనపు ఎస్పీ పోస్టులు** డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలిదశలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్యానల్ ఇయర్‌లో మరో 10 పోస్టులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.సీనియారిటీ, సర్వీసు కాలం, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పదోన్నతి జాబితాలను సిద్ధం చేశారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను వేగవంతం చేస్తానని డీజీపీ తెలిపారు. అర్హులైన అధికారులకు నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ వేళ ఉద్యోగులకు సెలవు

● 23 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 26న స్థానిక సెలవు..
గ్రామ పంచాయతీ ఎన్నికల రోజుల్లోనూ వెసులుబాటు

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 17: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల 26న స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ సెలవు వర్తించనుంది.ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సెలవు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల పోలింగ్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా జరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం1881 ప్రకారం స్థానిక సెలవు ప్రకటించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది. సెలవు ప్రకటించడం సాధ్యం కాని చోట్ల ఉద్యోగులు ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది.

చేనేత విశిష్టతను తెలుసుకున్న
కృష్ణవేణి విద్యార్థులు



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో రామన్నపేట లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. చేనేత వస్త్రాలు చేనేత ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు హైస్కూల్ విద్యార్థులను మంగళవారం రామన్నపేట పద్మశాలి కాలనీలోని పలు చేనేత కుటుంబాలలో నిర్వహించే పనులను సందర్శించే విధంగా ఫీల్డ్ వర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు నేరుగా చేనేత కార్మికుల వద్దకు వెళ్లి నోరు తయారీ, మగ్గం నడిచే విధానం, చేనేత చీరలు దోవతులు ఇతర ఉత్పత్తుల తయారీ విధానం గురించి స్వయంగా చూసి తెలుసుకున్నారు. పలువురు నేత కార్మికులు విద్యార్థులకు మగ్గం పని తీరు వివరిస్తూ చేనేత వస్త్రాల ప్రత్యేకతను వివరించారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాలకు చేతితో నేసిన వస్త్రాలకు నా తేడాను విద్యార్థులు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్, ఉపాధ్యాయులు ఎండి. అలీముద్దీన్, కే లావణ్య తదితరులు ఉన్నారు.

రామన్నపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 17:రామన్నపేట పట్టణంలోని 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపన చేయడం జరిగింది.మూతినేని మల్లేశం ఇంటి నుండి రాజేష్ ఇంటి వరకు చేపట్టనున్న ఈ డ్రైనేజీ పనులతో వార్డులో దీర్ఘకాలంగా ఉన్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోయే ఇబ్బంది తొలగి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోటే. రమేష్, సెక్రటరీ సైదిరెడ్డి, వార్డు సభ్యులు నోముల అనిత యాదయ్య, కొమ్ము రామస్వామి, మోట్ మహేష్, బండ లింగస్వామి, నకిరేకంటి సుదర్శన్, ఉట్కూరి శ్రీను, రాపోలు రాజశేఖర్, చెరుకు లక్ష్మయ్య, నోముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.వార్డు అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

అర్హులైన పేదలకు పెన్షన్లు ఇవ్వాలి: రాపోలు నరసింహా నేత

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17: చిన్న కారణాలతో పేదల పెన్షన్ దరఖాస్తులు తిరస్కరించడం అన్యాయమని, తిరస్కరించిన దరఖాస్తులన్నింటినీ మళ్లీ పరిశీలించి అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నిర్మలా నరసింహా నేత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పద్మశాలీలపై ప్రత్యేక ఆంక్షలు తగవన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ నేత విమర్శలు

- ఆరు గ్యారెంటీలు, ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 17: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.2023 నవంబర్ 17న విడుదల చేసిన అభయహస్తం మేనిఫెస్టోలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్, తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు విద్యా భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను కూడా నెరవేర్చాలని కోరారు.మహిళలకు నెలకు రూ.2,500 సాయం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రూ.4 వేల పింఛన్, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు వంటి హామీల అమలుపై ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల సంక్షేమ నిధి, వివిధ కుల వృత్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని ప్రభాకర్ రెడ్డి కోరారు. హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

చెత్త వేస్తే జరిమానాలు విధించాలి..!

- చౌటుప్పల్‌చిన్న కొండూరు రహదారిలో ఫారెస్ట్ సమీపంలో చెత్త కుప్పలు.. ప్రజల విజ్ఞప్తిని పట్టించుకోని కొందరు



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 17: చౌటుప్పల్ పట్టణంలో ప్రతి ఇంటి వద్దకు, ప్రతి దుకాణం వద్దకు మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా నిత్యం వచ్చి చెత్తను సేకరిస్తున్నప్పటికీ కొందరిలో మాత్రం మార్పు రావడం లేదు. చౌటుప్పల్ పట్టణం నుంచి చిన్న కొండూరుకు వెళ్లే రహదారిలో ఫారెస్ట్ సమీపంలో కొందరు రోడ్డు పక్కనే విచ్చలవిడిగా చెత్త వేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు.గతంలో ఈ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ రెండుసార్లు ప్రత్యేకంగా తొలగించడంతో పాటు, ఇక్కడ చెత్త వేయరాదని హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేయించారు. అయినప్పటికీ కొందరు తమ తీరు మార్చుకోకుండా మళ్లీ అదే ప్రాంతంలో చెత్త వేస్తుండటంతో సమస్య పునరావృతమవుతోందిరోడ్డు పక్కన పేరుకుపోతున్న చెత్తతో పరిసరాలు అపరిశుభ్రం గా మారడమే కాకుండా, దుర్వాసన వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. చెత్తను సక్రమంగా సేకరించేందుకు మున్సిపాలిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, కొందరి నిర్లక్ష్యంతో పట్టణ పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలుగుతోంది.కావున మున్సిపల్ కమిషనర్ గారు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, రోడ్డు పక్కన చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైన చోట నిఘా ఏర్పాటు చేసి, మరోసారి అక్కడ చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చౌటుప్పల్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా.

నేలపట్లవర్కట్‌పల్లి రోడ్డు ఎప్పుడు బాగు చేస్తారు?

మూడేళ్లుగా పట్టించుకోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి

తడక మోహన్ చౌటుప్పల్ మండల సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు

తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 17: మునుగోడు నియోజకవర్గం, భువనగిరి నియోజకవర్గం సరిహద్దులో ఉన్న చౌటుప్పల్ మండలం నేలపట్లవర్కట్‌పల్లి గ్రామాల మధ్య కేవలం ఒక్క కిలోమీటరు పొడవున్న రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని చౌటుప్పల్ మండల సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు తడక మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.గత మూడు సంవత్సరాలుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ రహదారి సమస్యపై ఏమాత్రం దృష్టి సారించకపోవడం దారుణమన్నారు. ఈ రహదారి మీదుగా అనేక గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, రహదారి పూర్తిగా దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అనేకమంది ప్రమాదాల్లో కాళ్లు, చేతులు విరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ఈ రహదారి మీదుగా ట్రాక్టర్లలో ధాన్యం తరలించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు గుంతల కారణంగా ట్రాక్టర్ల నుంచి వరి ధాన్యం రోడ్డుపై పడిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. రైతుల కష్టాలను ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వర్గీయ ఎలిమినేటి మాధవరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారిని నిర్మించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు పాలక ప్రభుత్వాలు కనీసం మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేవని విమర్శించారు.ఈ సమస్య పరిష్కారం కోసం వర్కట్‌పల్లి, నేలపట్ల గ్రామపంచాయతీలు ప్రత్యేక తీర్మానాలు చేసి, సంబంధిత ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో వర్కట్‌పల్లి, నేలపట్ల గ్రామాల ప్రజలను సమీకరించి ఇరు ప్రాంతాల ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని తడక మోహన్ హెచ్చరించారు. ప్రజల ప్రాణాలకు, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన ఈ రహదారి సమస్యను ఇకనైనా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆలయ అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తున్న అధ్యక్షులు ఎరుకల రాందాస్ గౌడ్

- నాణ్యతలో రాజీ లేకుండా నూతన దేవాలయాలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు పూర్తి చేయడమే లక్ష్యం



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 17: చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆలయ అధ్యక్షులు ఎరుకల రాందాస్ గౌడ్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలో నూతన దేవాలయాల నిర్మాణ పనులతో పాటు ప్రహరీ గోడ నిర్మాణం, ప్రహరీ గోడకు ఏర్పాటు చేస్తున్న రాతి బండల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రతి పని పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత పనివారికి సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడంతో పాటు దేవాలయ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు ఈ సందర్భంగా కనిపించింది.దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్న ఆలయ అధ్యక్షులు ఎరుకల రాందాస్ గౌడ్ కృషిపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పాలనకు కుంకుడు పాములే సాక్ష్యం

- ఎమ్మెల్యే వేముల వీరేశంకు గ్రామస్తుల ఘన సన్మానం, కృతజ్ఞతలు



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 17:ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కుంకుడు పాముల గ్రామంలో సాకారమయ్యాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో, ప్రభుత్వ సహకారంతో గ్రామంలో నూతనంగా 18 మంది నిరుపేదలకు పెన్షన్లు, 18 కుటుంబాలకు ఇండ్లు, 28 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్లు, ఇండ్లు, రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు గ్రామస్తులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. రామన్నపేట ఎంపీడీవో ఏ రాములురామన్నపేట మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డిమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు మమ్మద్ జమీరుద్దీన్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎండి అక్రమ్ నల్ల శ్రీనివాస్ రెడ్డి, బొక్క జయచంద్ర రెడ్డి, బొక్క జగన్మోహన్ రెడ్డి, నాతి స్వామి, మిట్టగడప రవి, బాసాని యాదగిరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు







ఆధ్యాత్మిక ప్రశాంతతకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదం

దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 17:చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సతీమణి లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుందని, మానసిక ప్రశాంతత కోసం తాను కూడా అయ్యప్ప దీక్ష చేపట్టినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని దేవాలయ కమిటీకి హామీ ఇచ్చారు. భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణ వంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దేవాలయ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు నాయక్, దేవాలయ కమిటీ అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ల మురళి గురుస్వామి, మాజీ అధ్యక్షులు భాస్కర్ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి తూర్పాటి శంకర్ గురుస్వామి, మాజీ ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి, సుర్వి నరసింహ గౌడ్, స్థానిక కౌన్సిలర్ పిల్లలమరి మధుసూదన్ తదితరులు, దేవాలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ల పత్రాల పంపిణీలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై నిరంజన్ గౌడ్ ఆగ్రహం!

ప్రభుత్వ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించడం సరికాదు

స్థానిక ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం కల్పించాలి

గిర్కటి నిరంజన్ గౌడ్ సర్పంచ్, దండు మల్కాపురం గ్రామం జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి యాదాద్రి భువనగిరి జిల్లా



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 17: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమంలో నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు చెందిన సర్పంచులు, కౌన్సిలర్లకు తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పించకపోవడంపై దండు మల్కాపురం గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి గిర్కటి నిరంజన్ గౌడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవంగా ఆహ్వానించి, వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే వేదికపై ప్రాధాన్యత కల్పించడం, ఇతర ప్రజాప్రతినిధులను విస్మరించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.అంతేకాకుండా, గ్రామాల్లో పింఛన్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను సంబంధిత గ్రామ సర్పంచులకు అందించకపోవడం బాధాకరమన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా మాత్రమే లబ్ధిదారులకు పింఛన్ల పత్రాలు పంపిణీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు, స్థానిక ప్రజాప్రతినిధుల గౌరవానికి విరుద్ధమని విమర్శించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాల్సి ఉంటుందని, అధికారిక కార్యక్రమాల్లో రాజకీయాలకు తావులేకుండా ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని అధికారులను నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు.

1,625 మందికి ఉచిత కంటి పరీక్షలు

- 52 మందికి శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్‌కు తరలింపు

తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 17:నెక్కొండలో జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఆరో విడత ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ట్రస్ట్ చైర్మన్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 1,625 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన 52 మందిని గుర్తించి హైదరాబాద్‌కు తరలించగా, కంటి అద్దాలు అవసరమైన పలువురికి ఉచితంగా అద్దాలు అందజేశారు.ఈ సందర్భంగా డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ఇంద్రియాల్లో కన్ను ప్రధానమని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నర్సంపేటలో ఎవరికీ కంటి సమస్యలు లేకుండా చూడటమే తన లక్ష్యమని, పేదలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడమే జనతా ట్రస్ట్ ఆశయమని తెలిపారు. భవిష్యత్తులో







మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి నెక్కొండ మండలంలోని ప్రతి గ్రామానికి వైద్య సేవలు చేరువ చేస్తామని హామీ ఇచ్చారు.శిబిరం నిర్వహణకు వాసవి కళ్యాణ మండపాన్ని ఉచితంగా అందించిన నెక్కొండ ఆర్యవైశ్య సంఘం సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్థానిక నాయకులు, జనతా ట్రస్ట్ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, మండల ప్రజలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు నూతన పింఛన్ అందజేస్తున్న చల్ల వరలక్ష్మి పిచ్చిరెడ్డి, సర్పంచ్ బి.తుర్కపల్లి



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 17:రామన్నపేట మండలం బి తుర్కపల్లి గ్రామానికి నూతనంగా సాంక్షన్ అయిన సంక్షేమ పథకాలను గ్రామ సర్పంచ్ చల్ల వరలక్ష్మి పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగినది అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే వేముల వీరేశం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ వార్డ్ మెంబర్లు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 17:
చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పింఛన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవనానికి అండగా నిలవడమే చేయూత పథకం ఉద్దేశమని పేర్కొన్నారు.

జనతా ట్రస్ట్ 6వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం

• 1625 మంది కళ్లల్లో వెలుగు నింపిన వైద్య శిబిరం

తొలి అక్షరం/వరంగల్ ప్రతినిధి: నెక్కొండలో మానవత్వం పరిమళించింది 1625 మంది కళ్లల్లో వెలుగు నింపిన జనతా ట్రస్ట్ 6వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.నెక్కొండ మండలం చరిత్రలో ఇది ఒక మరపురాని రోజు శ్రీ వాసవి కళ్యాణ మండపం ఉదయం నుండే జనంతో కిక్కిరిసిపోయింది వయసుతో పాటు కంటి చూపు తగ్గిపోయిన పెద్దలు కళ్లల్లో నీరు కారుతూ బాధపడుతున్న తల్లులు చిన్న వయసులోనే కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న యువకులు అందరూ ఒకే ఆశతో వచ్చారని మాకు కంటి చూపు వస్తుందా అని వారి ఆశను నిజం చేసింది జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వారితో కలిసి నెక్కొండలో నిర్వహించిన 6వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం ఘన విజయం సాధించింది జనతా ట్రస్ట్ చైర్మన్ డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకంగా 1625 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.ఇది కేవలం పరీక్షలకే పరిమితం కాలేదు కంటి ఆపరేషన్ అవసరమైన వారిని అక్కడికక్కడే గుర్తించి 52 మందిని ఆపరేషన్ల కోసం హైదరాబాద్ తరలించి వారికి మార్గదర్శకత్వం అందించారు కంటి అద్దాలు అవసరమైన వందలాది మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు డబ్బు లేక కంటి ఆపరేషన్ చేయించుకోలేని పేద కుటుంబాలకు ఇది నిజంగా దేవుడు ఇచ్చిన వరం లాంటిది.ఈ సందర్భంగా జనతా ట్రస్ట్ చైర్మన్ డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ...సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని అన్ని ఇంద్రియాలలో కన్ను ముఖ్యమైనదని కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని





అన్నారు,నర్సంపేట నియోజకవర్గం లో ఏ ఒక్కరికి కూడా కంటి సమస్య లేకుండా చేయడమే తన బాధ్యత అని ఈ సందర్భంగా తెలియజేశారు,పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించడమే జనతా ట్రస్ట్ లక్ష్యమని ఇది ఒక్కసారితో ఆగేది కాదని తెలిపారు.ఈ కార్యక్రమానికి నెక్కొండ వాసవి కళ్యాణ మండపాన్ని ఉచితంగా ఇచ్చిన నెక్కొండ ఆర్యవైశ్య సంఘానికి డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముందుకు వచ్చిన ఆర్యవైశ్య సంఘం సభ్యులకుప్రత్యేకమైన కృతజ్ఞతలు,మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో ఇంకా చాలా పెద్ద ఎత్తున ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని నెక్కొండ మండలంలోని ప్రతి గ్రామానికి ప్రతి గడపకు వైద్య సేవలను తీసుకెళ్తామని ఎవరూ కంటి చూపు లేక బాధపడకూడదని ఎవరూ డబ్బు లేక వైద్యం చేయించుకోలేని పరిస్థితి రాకూడదని స్పష్టంగా చెప్పారు జనతా ట్రస్ట్ ద్వారా నిరంతరం ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ క్యాంపును నెక్కొండ మండల ప్రజలు అందరూ పూర్తిగా వినియోగించుకున్నారని ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు క్యూ కట్టి మరీ పరీక్షలు చేయించుకున్నారు వైద్యుల సూచనలు జాగ్రత్తగా విన్నారు చాలా మంది వృద్ధులు కంటి అద్దాలు పెట్టుకుని మళ్లీ స్పష్టంగా చూడగలుగుతున్నామని కళ్లల్లో ఆనందంతో చెప్పడం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కదిలించింది.ఈ కార్యక్రమంలో మారం రాము, దొడ్డనాగేష్, తాటి పెళ్లి శివకుమార్,దొడ్డ విజయ్, తాళ్లూరి నరసింహులు,కొనిశెట్టి బిక్షపతి, నాయిని అశోక్,దామచర్ల రామారావు,అంబాల రాంగోపాల్, రాంపల్లి రాజగోపాల్,శ్రీరంగం సాగర్, అంబాల సుధీర్,పసుల అశోక్,సింగారపు సురేష్,సింగారం శ్రీరాములు,శ్రీనివాస్,నీలం ఏలేందర్, లొడియా శ్రీనివాస్,జమ్ముల సుధాకర్, మల్లం మల్లేష్,కుడికాల సుధీర్,పోయాడ అనిల్,జయప్రకాష్, శ్రీనివాస్ గౌడ్ శెట్టి,సూత్రం శీను,రాజు,బల్లికొండ పవన్,కుడికాల శ్రీధర్,శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం జనతా ట్రస్ట్ సభ్యులు నెక్కొండ మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌కు సేవా రత్న పురస్కారం

- ప్రశంస పత్రం,జ్ఞాపిక అందజేసిన బాలరాజు



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: గీసుకొండ మండలంలోని ధర్మారం వాసి,కమిషనరేట్ పరిధిలోని కేయూ పోలీస్‌స్టేషన్లో హెడ్కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి.జయరాజుకు కేబీఆర్ ఫౌండేషన్ సేవా రత్న పురస్కారం అంద జేసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో జరిగిన ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జయరాజును ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ కొడవటికంటి బాలరాజు ఆధ్వర్యంలో ప్రశంస పత్రం,జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సత్కరిం చారు.అలాగే తలసీమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ (టీఎన్బీసీ) సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అంద జేసి సన్మానించింది.ఏటా పలుమార్లు రక్తదానం చేస్తూ మానవ సేవలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న జయరాజు ఇదే కార్యక్రమంలో 39వ సారి రక్తదానం చేయడం గమనార్హం.ఈ సందర్భంగా జయరాజు మాట్లాడారు.రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు.ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఆర్నెల్లకోసారి రక్తదానానికి చేయాలని ఆకాంక్షించారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లో ప్రధానమంత్రి

జీవనజ్యోతి పథకం ద్వారా లబ్ధి అమలు

- మండల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కుందన్.



తొలిఅక్షరం/నెక్కొండ నవంబర్ 17: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో కొద్ది రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మరణించినటువంటి కీ.శే జాటోత్ రమేష్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు నెక్కొండ బ్రాంచ్ లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి కేంద్ర ప్రభుత్వ పథకం రిజిస్టర్ చేసుకొని ఉండడం జరిగింది. కాబట్టి జాటోత్ రమేష్ నామినీ అయినటువంటి జాటోత్ రజిత కు ఖాతాలో 2 లక్షల రూపాయలు జమ చేయడం జరిగింది. దీనికి రజిత హర్షం వ్యక్తం చేస్తూ ఈ యొక్క ఆర్థిక భరోసాని వారి పిల్లల చదువులకు ఉపయోగించుకుంటామని, ఈ సందర్భంగా నెక్కొండ టి జి బి బ్రాంచ్ మేనేజర్ కుందన్ కి మరియు నెక్కొండ మండల సీ ఎఫ్ ఎల్ కౌన్సిలర్ మహేష్ కి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా పీ జీ బీ బ్రాంచ్ మేనేజర్ కుందన్ మాట్లాతూ ఈ యొక్క కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి నెక్కొండ మండల టీ జీ పీ బ్రాంచ్ మేనేజర్ కుందన్ మరియు, సి, ఎఫ్,యల్ నెక్కొండ మండల కౌన్సిలర్ బరిగెల మహేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

పెన్షన్‌పై పట్టు.. ఓపీఎస్ కోసం పోరు

- సామూహిక సెలవులో పాల్గొన్న 90 మంది ఉపాధ్యాయ, ఉద్యోగులు.. జిల్లా కేంద్రంలో ధర్నా



తొలిఅక్షరం/నర్సింహులపేట నవంబర్ 17: పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం నర్సింహులపేట మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు సామూహిక సెలవులో పాల్గొన్నారు. మండలం నుంచి సుమారు 90 మంది ఉద్యోగులు సెలవు పెట్టి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ధర్నా, దీక్షా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు భూక్య నాగేష్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా సీపీఎస్ రద్దుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగుల భవిష్యత్తు మార్కెట్ ఒడిదొడుకులపై ఆధారపడుతోందని, పదవీ విరమణ అనంతరం తగిన ఆర్థిక భద్రత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు, వారి కుటుంబాలకు సామాజిక, ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. జీపీఎస్, ఎన్‌పీఎస్, యూపీఎస్ వంటి ప్రత్యామ్నాయ విధానాలు తమకు వద్దని, పాత పెన్షన్ విధానమైన ఓపీఎస్‌ను మాత్రమే అమలు చేయాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో నర్సింహులపేట మండలానికి చెందిన నాగేష్, రాజు, బాలాజీ, వెంకన్న, వరకుమార్, శ్రీలత, నివాస్‌రెడ్డి, అశోక్, మోహన్, రవి, సమ్మరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఐనవోలు మండలం నందనం ఎఫ్ ఎ సి ఎస్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో ఐనవోలు మండలం,వర్ధన్నపేట మున్సిపాలిటీ,వర్ధన్నపేట మండలాలకు చెందిన చేయూత పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలు,వృద్ధులు,దివ్యాంగులు,ఒంటరి మహిళలు,ఇతర అర్హులైన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా,వృద్ధులు,దివ్యాంగులు,ఇతర లబ్ధిదారులకు ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పించే సాధనమని అన్నారు.ప్రతి నెలా అందించే పింఛన్ ద్వారా లబ్ధిదారులకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని,ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,వైస్ చైర్మన్ శిబారాణి రాజేందర్,వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న,మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య,జెబిఎం చైర్మెన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి,యూత్ అధ్యక్షులు భాను ప్రసాద్,డైరెక్టర్లు, సర్పంచులు,ఉపసర్పంచులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,సంబంధిత అధికారులు,పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

960 మందికి కొత్త పింఛన్లు మంజూరు

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం: వేముల వీరేశం



తొలి అక్షరం /ప్రత్యేక కథనం రామన్నపేట, నవంబర్ 17: రామన్నపేట మండలంలో 960 కొత్త పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో అర్హులైన పేదలకు పింఛన్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కథనంలో పేర్కొన్నారు.మంజూరైన పింఛన్లలో 438 వితంతువులకు, 178 దివ్యాంగులకు, 157 గీత కార్మికులకు, 127 చేనేత కార్మికులకు, 49 ఒంటరి మహిళలకు, 11 ఒంటరి పురుషులకు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా మొత్తం రూ.23,31,260 లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంలో ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేస్తున్నారని కథనం పేర్కొంది. పింఛన్ల మంజూరుపై ఆయన నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకున్నారని వివరించింది.కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన శ్రీపాద అంజిచారికి దివ్యాంగుల పింఛను మంజూరైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను రావడంతో తనకు ఆర్థిక భరోసా లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని పలువురు వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు పింఛన్లు అందడంతో ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను, ఇల్లు, రేషన్ కార్డు అందేలా కృషి చేస్తానని వేముల వీరేశం పేర్కొన్నట్లు కథనంలో వెల్లడించారు. 960 పింఛన్లు ప్రారంభం మాత్రమేనని, చివరి అర్హుడికి కూడా సంక్షేమ ఫలాలు అందే వరకు ప్రయత్నం కొనసాగిస్తానని ఆయన తెలిపినట్లు పేర్కొన్నారు.

నందిగామలో 562 మందికి నూతన చేయూత పెన్షన్లు

- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17: అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అరుంధతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. నందిగామ మండలంలో పెన్షన్ల కోసం మొత్తం 575 దరఖాస్తులు రాగా, అర్హత కలిగిన 562 మందికి పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. వీరికి ప్రతినెలా సుమారు రూ. 13 లక్షల ఆర్థిక ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు. దివ్యాంగులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కుమార్ గౌడ్, శేఖర్ రెడ్డి, సర్పంచులు, అధికా రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమ కారుడి కూతురు వివాహ వేడుకలో పాల్గొన్న కొండా సురేఖ



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: తెలంగాణ ఉద్యమకారుడు ఈదుల రమేష్ కూతురు వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రి,వరంగల్ తూర్పు ఎం ఎల్ ఏ కొండా సురేఖ,డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్, గోపాల నవీన్ రాజ్.తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు ఈదుల రమేష్ చిన్న కూతురు వివాహ వేడుక భట్టుపల్లి లోని ఏ జీ ఆర్ గార్డెన్ లో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు మాజీ మంత్రి,తూర్పు ఎం ఎల్ ఏ కొండా సురేఖ హాజరై దంపతులను ఆశీర్వదించారు.ఈ వివాహ వేడుకలో సామాజిక వేత్త డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్,కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్,కేడల పద్మా జనార్దన్,పగడాల సతీష్,కలకోట్ల రమేష్,పాస్టర్ ఏలియా,పాల రంజిత్,మాదాసి రాములు,కలకోట్ల రాజు,ఈదుల అన్వేష్,బొక్కా సదానందం,బానోత్ వెంకన్న,మంద శ్రీనివాస్,నెల్సన్ తదితరులు హాజరైనారు.

ఇందిరమ్మ బీమా నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నవంబర్ 19 నుంచి శిబిరాలు.. అర్హులందరికీ రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందించాలి



తొలి అక్షరం/ములుగు జిల్లా, నవంబర్ 17 : అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. నవంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న బీమా నమోదు శిబిరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న కుటుంబ సంపాదన సభ్యుల్లో ఒకరికి ఈ పథకం వర్తిస్తుందని, వారి మరణం సంభవిస్తే కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందుతుందని తెలిపారు. నమోదు ప్రక్రియను డిసెంబర్ 18 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, రోజువారీ నమోదు లక్ష్యాలను నిర్దేశించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ల ధ్రువీకరణలో కచ్చితత్వం పాటించాలని, ముఖ్యంగా నామినీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. పూర్తి చేసిన దరఖాస్తులపై మాత్రమే సంతకాలు తీసుకోవాలని, పత్రాలను భద్రపరచాలని స్పష్టం చేశారు.శిబిరాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్, విద్యుత్‌తో పాటు తాగునీరు, కూర్చునే సదుపాయాలు కల్పించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన కుటుంబాలన్నీ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్, సంపత్ రావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టిన బంజారాల పండుగ..

కడియాలకుంట తండాలో సంప్రదాయాల సందడి.. అంగరంగ వైభవంగా దసరావ్ వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టులు కేపి తదితరులు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా నిలిచే బంజారాల సంప్రదాయ పండుగ దసరావ్ వేడుకలు ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. తండాలోని ప్రతి ఇంటా పండుగ శోభ సంతరించుకోగా, బంధుమిత్రులు, ఆత్మీయుల రాకతో గిరిజనుల గృహాలు కళకళలాడుతున్నాయి. ఇళ్ల ముందు విద్యుత్ దీపాల వెలుగులు, సంప్రదాయ ఆచారాలు, పండుగ సందడి తండా అంతటా ప్రత్యేక వాతావరణాన్ని నెలకొల్పాయి.బంజారా సంప్రదాయంలో దసరావ్ కేవలం పండుగ మాత్రమే కాదు.. తరతరాలుగా వస్తున్న ఆచారాలను గుర్తుచేసుకుంటూ, కులదైవమైన తుల్జాభవానీ మాతను భక్తిశ్రద్ధలతో ఆరాధించే పవిత్ర వేడుక. సాతీ భవానీ అమ్మవార్ల పూజలు, సంప్రదాయ నైవేద్యాలు, పశువుల పూజలు, భజనలు, జానపద గీతాలు, నృత్యాలతో ఈ ఉత్సవాలు ప్రత్యేకతను చాటుకుంటాయి. ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా సొంత తండాకు చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పండుగను జరుపుకోవడం ఈ వేడుకల్లో కనిపించే విశేషమైన ఆత్మీయత.ఈ నేపథ్యంలో కడియాలకుంట తండాలో నివాసముంటున్న జర్నలిస్ట్ మేఘావత్ నరేందర్ స్వగృహంలో నిర్వహిస్తున్న దసరావ్ వేడుకలకు షాద్‌నగర్‌కు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు హాజరై కుటుంబ సభ్యులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు కేపీ, రాఘవేందర్ గౌడ్, సాయినాథ్ రెడ్డి, పోలీస్ నిఘా కృష్ణ, దర్శనం శంకర్, వానరాసి జగన్ తదితరులు నరేందర్ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా నరేందర్ కుటుంబ సభ్యులు జర్నలిస్టులకు సాదర స్వాగతం పలికి సంప్రదాయబద్ధంగా ఆతిథ్యం అందించారు. వారి ఆప్యాయత, ఆదరణ, మర్యాదలు అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పండుగ వేళ కలిసిన మిత్రులు, ఆత్మీయుల మధ్య సాగిన ఆప్యాయ పలకరింపులు వేడుకలకు మరింత వన్నె తెచ్చాయి.ఒకవైపు సంప్రదాయాల పరిమళం.. మరోవైపు బంధుత్వాల మమకారం.. ఇంకోవైపు స్నేహబంధాల సందడి.. ఇలా కడియాలకుంట తండా దసరావ్ వేడుకలతో పులకించిపోతోంది. ఆధునిక జీవనశైలిలోనూ తమ పూర్వీకుల సంస్కృతిని కాపాడుకుంటూ, తరతరాలకు అందిస్తున్న బంజారా కుటుంబాల ఐక్యత, ఆత్మీయత ఈ వేడుకల ద్వారా మరోసారి చాటిచెప్పబడుతోంది.

బీజేవైఎం జిల్లా లీగల్ కో కన్వీనర్‌గా కంచుకోట మణికంఠ

- పార్టీ కోసం కష్టపడిన యువ న్యాయవాదికి సముచిత గుర్తింపు



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 17: కేశంపేట మండలం పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువనేత, న్యాయవాది కంచుకోట మణికంఠకు భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా లీగల్ కో కన్వీనర్‌గా పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది. గతంలో పోమాల్‌పల్లి గ్రామ బీజేపీ ఉపాధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన కేశంపేట మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేశారు. మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా ఐటీ సెల్, సోషల్ మీడియా కో కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. షాద్‌నగర్, చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో పార్టీ ప్రచారానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా నాయకత్వం కొత్త బాధ్యతలు అప్పగించడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా పుట్నాల సాయికుమార్

- ఏబీవీపీ సేవలకు గుర్తింపు.. సాయికుమార్‌కు కీలక బాధ్యత
- పార్టీ అభివృద్ధికి కృషి.. జిల్లా యువమోర్చాలో సాయికుమార్‌కు స్థానం



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17: అంకితభావంతో విద్యార్థి, యువజన రంగాల్లో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన పుట్నాల సాయికుమార్‌కు అరుదైన గుర్తింపు లభించింది. రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా ఆయనను జిల్లా పార్టీ అధిష్టానం నియమించింది. కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సాయికుమార్ ఏబీవీపీలో వివేకానంద డిగ్రీ కళాశాల సెక్రటరీగా, కేశంపేట మండల కన్వీనర్‌గా, షాద్‌నగర్ పట్టణ కార్యదర్శిగా, గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడిగా, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి పరిషత్ బలోపేతానికి అనేక సంవత్సరాలు కృషిచేశారు. అనంతరం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. ఆయన సేవలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను గుర్తించిన జిల్లా నాయకత్వం తాజా బాధ్యతలు అప్పగించింది. ఈ నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సాయికుమార్‌కు అభినందనలు తెలిపారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ బాధ్యతలు అప్పగించడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు.

పేదలకు అండగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిపారసుతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు

లబ్ధిదారులకు 6,05,000 విలువగల చెక్కులను అందజేసిన బీఆర్ఎస్ నాయకులు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17: షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఫరూక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన పులి అరుణ, ఈగ సుశాంక్, కొత్తొల్ల ప్రణీత్ , మరియు కటిక సత్యనారాయణ,కిషన్ నగర్ గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి, ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రాములమ్మ,లింగారెడ్డి గూడ గ్రామానికి చెందిన బక్కని యాదయ్య,ఎలికట్ట గ్రామానికి చెందిన నారం పుల్లారెడ్డి,కందివనం గ్రామానికి చెందిన డి. రామచంద్రయ్య,పులి చెర్ల కుంట తండా గ్రామానికి చెందిన మురళి,దేవునిపల్లి గ్రామానికి చెందిన పారా బాల్ రాజ్,రంగసముద్రం గ్రామానికి చెందిన జవ్వాజి స్వాతి తదితరులకు మంజూరైన 605000/ విలువగల సియంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఆయన సిఫారసుతో ప్రభుత్వానికి నివేదించగా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు షాద్ నగర్ ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు,ప్రజలకు ఎమ్మెల్సీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.తమకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్ నందకిషోర్,మొగిలి గిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,కందివనం సర్పంచ్ అమ్మనాయక్,మాజీ ఎంపిటిసి బిశ్వ రామ క్రిష్ణ,మాజీ సర్పంచ్లు ప్రశాంత్ రెడ్డి,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,ఉపసర్పంచ్లు యాదగిరి,మూడవత్ గణేష్,మాజీ ఉపసర్పంచ్లు మల్లేష్ యాదవ్,నరేష్,బీఆర్ఎస్ నాయకులు శంకరయ్య గౌడ్,శేరి శ్రీనివాస్ రెడ్డి,చించోడ్ బాల్ రాజ్,కంసాన్ పల్లి బాల్ రాజ్, నేనావత్ నరేష్,శివ,అన్వారీ రాజు, దినేష్ సాగర్, మధు, ప్రశాంత్, శేఖర్, కుమార్, సురేష్,గోపాల్మల్లేష్,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి సన్నిధిలో గీరాయిగుట్ట తండా సర్పంచ్

- గ్రామ ప్రజల సంక్షేమం కోసం బాలరాముడికి ప్రత్యేక పూజలు
- రామయ్యను దర్శించుకున్న సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 17: ఫరూఖ్‌నగర్ మండలం పరిధిలోని గీరాయిగుట్ట తండా గ్రామపంచాయతీ సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామజన్మభూమిని సందర్శించి బాలరాముడిని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తులతో కలిసి రామనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రాముడి ఆశీస్సులతో గీరాయిగుట్ట తండా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొని ప్రజలందరికీ మంచి జరగాలని మొక్కులు చెల్లించుకున్నారు. భగవంతుడి కృపతో గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.


ఓట్ చోర్, నోట్ చోర్, సంపద చోర్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ 29న హైదరాబాద్‌లో ప్రజా గర్జన

- మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



తొలి అక్షరం/జవహర్ నగర్ నవంబర్ 17 :ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలు, ప్రజా సంపద దోపిడీకి వ్యతిరేకంగా, కేంద్రంలోని బీజేపీఆర్ఎస్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 29న హైదరాబాద్‌లో వేలాది మందితో 'ప్రజా గర్జన' ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని, ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దళితులు, ఆదివాసీలు, వలస కార్మికులు, ప్రభుత్వాన్ని విమర్శించే ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని నాయకులు ఆరోపించారు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కోల్పోయిందని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.అదానీ, అంబానీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను కట్టబెడుతూ, నిరుద్యోగం, అధిక ధరలు, ప్రజల మౌలిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు.డిసెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాల్లో 16 డిమాండ్లతో ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రధాన డిమాండ్లు: ఎస్ఐఆర్‌ను రద్దు చేసి ఓటు చోరీని అరికట్టాలి; డీలిమిటేషన్, జమిలి ఎన్నికల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి; అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి ఎంఎస్పీ చట్టం అమలు చేయాలి; రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలను నెరవేర్చాలి; కరువు రైతులను ఆదుకోవాలి; కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేసి ఇల్లందు, మహబూబాబాద్‌కు విస్తరించాలి; చౌక ధరల దుకాణాల ద్వారా 12 రకాల నిత్యావసరాలు పంపిణీ చేయాలి; పెన్షన్లు పెంచాలి.నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, బీడీ కార్మికుల జీవనభృతి పెంచాలి. కేజీబీవీ, ఆశా, అంగన్‌వాడీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.40 వేలు ఇవ్వాలి. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా కల్పించాలి. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసి, ఉపాధి హామీని 250 రోజులకు పొడిగించి రోజువారీ వేతనం రూ.700 చెల్లించాలి.విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి ప్రైవేట్ కళాశాలల ఫీజులను నియంత్రించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఆసుపత్రి కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి. పేదలు, కౌలు రైతులకు పెన్షన్లు, వ్యవసాయ కార్మికులకు గుర్తింపు కార్డులు, జీవనభృతి కల్పించాలి.

కోహ్లీ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు!



టెస్టులకు వీడ్కోలు పలకడం కెరీర్‌లోనే పెద్ద తప్పిదం

పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ బాధపడతాడన్న దిగ్గజ క్రికెటర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం, 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టెస్టులకు వీడ్కోలు పలకడం కోహ్లీ కెరీర్‌లోనే అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డారు. పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ పశ్చాత్తాపపడతాడని వ్యాఖ్యానించారు. అద్భుతమైన ఫిట్‌నెస్ కలిగిన కోహ్లీ మరికొంత కాలం టెస్టు క్రికెట్‌లో కొనసాగాల్సిందని పేర్కొన్నారు.మిడ్‌డేతో మాట్లాడిన కపిల్ దేవ్.. కోహ్లీ ఫిట్‌నెస్ ఏ ఇతర ఆటగాడికీ తీసిపోదని, 25 ఏళ్ల యువ క్రికెటర్‌తోనూ పోటీపడగల సామర్థ్యం అతనికి ఉందని ప్రశంసించారు. ఇంతటి శారీరక సామర్థ్యం ఉన్న ఆటగాడు టెస్టులకు వీడ్కోలు పలకడం సరైన నిర్ణయం కాదన్నారు. **మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి**కష్టకాలంలో ఆగ్రహంతో రిటైర్మెంట్ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కపిల్ హితవు పలికారు. మాజీ క్రికెటర్ మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అమర్‌నాథ్ పలుమార్లు జట్టులో స్థానం కోల్పోయినా తిరిగి పుంజుకుని తన ప్రతిభను నిరూపించుకున్నారని గుర్తుచేశారు. ఆటగాళ్లు కూడా విమర్శలు, ఒడిదుడుకులకు కుంగిపోకుండా తిరిగి జట్టులో స్థానం సంపాదించేందుకు ప్రయత్నించాలని అన్నారు. **123 టెస్టుల్లో 9,230 పరుగులు** విరాట్ కోహ్లీ 2025 మే 12న టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించారు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు.కోహ్లీతో పాటు రోహిత్ శర్మ భవిష్యత్తుపైనా కపిల్ దేవ్ స్పందించారు. ఆటగాళ్ల భవిష్యత్తును ఎంపిక సంఘమే నిర్ణయించాలని, దేశానికి సేవలందించిన ప్రతి ఆటగాడూ ఏదో ఒక దశలో ఆటకు వీడ్కోలు పలకాల్సిందేనని పేర్కొన్నారు.

ధోనీ అభిమానులకు భారీ షాక్!



- ఐపీఎల్‌కు ఆటగాడిగా వీడ్కోలు..

చెన్నై సూపర్ కింగ్స్‌కు కొత్త బాధ్యతల్లో ధోనీ

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అభిమానులకు షాకింగ్ న్యూస్. ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రస్థానానికి ధోనీ ముగింపు పలికారు. 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అయితే ఆటగాడిగా తప్పుకున్నప్పటికీ ధోనీ చెన్నై జట్టుతోనే కొనసాగనున్నారు. ఇకపై జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నారు. **మెంటార్‌గా కొత్త బాధ్యతలు** 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ధోనీ కీలక ఆటగాడిగా కొనసాగారు. ఆయన నాయకత్వంలో సీఎస్కే ఐదు ఐపీఎల్ టైటిళ్లను సాధించింది. ధోనీ రిటైర్మెంట్‌పై జట్టు యాజమాన్యం భావోద్వేగ స్పందన తెలిపింది. ధోనీ లేకుండా చెన్నై సూపర్ కింగ్స్‌ను ఊహించలేమని జట్టు యజమాని ఎన్. శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2008లో ధోనీని జట్టులోకి తీసుకోవడం తన అత్యుత్తమ నిర్ణయమని కొనియాడారు. **గాయాల కారణంగా నిర్ణయం** గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బందిపడుతున్న ధోనీ 2026 ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరంగా ఉన్నారు. తన శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకున్న అనంతరం ఆటగాడిగా కొనసాగడం కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెంటార్‌గా యువ ఆటగాళ్లకు తన అనుభవాన్ని పంచుకోనున్నారు. **ఐపీఎల్‌లో ధోనీ ఘనతలు**ధోనీ మొత్తం 278 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించారు. కెప్టెన్‌గా 235 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 136 విజయాలు అందించారు. 2010, 2011, 2018, 2021, 2023లో చెన్నైకి ఐదు టైటిళ్లు అందించారు. ఆటగాడిగా మైదానంలో కనిపించకపోయినా మెంటార్‌గా చెన్నై జట్టుతో కొన సాగనుండటంతో అభిమానులకు కొంత ఊరట లభించనుంది.

కివీస్‌పై పేస్ దాడికి గిల్ వ్యూహం!

నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి భారత్.. తుది జట్టుపై కెప్టెన్ కసరత్తు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగనుంది. ఈ విషయాన్ని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశారు. గురువారం (నవంబర్ 19) నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ జట్టు కూర్పుపై వివరాలు వెల్లడించారు. ఏడుగురు ప్రధాన బ్యాటర్లతో పాటు నలుగురు పేసర్లను ఆడించాలని నిర్ణయించినట్లు తెలిపారు. **పేసర్ల ఎంపికపై తర్జనభర్జన** ప్రస్తుతం భారత జట్టులో ఫాస్ట్ బౌలర్లందరూ మంచి ఫామ్‌లో ఉండటంతో తుది జట్టును ఎంపిక చేయడం కష్టంగా మారిందని గిల్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి బౌలర్లు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలన్నది జట్టు యాజమాన్యానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు.మ్యాచ్ తొలి రెండు రోజుల్లో పిచ్ నుంచి పేసర్లకు సహకారం లభించే అవకాశం ఉందని, మూడో రోజు నుంచి వికెట్ నెమ్మదిగా మారుతుందని గిల్ వివరించారు. పాత బంతితోనూ వికెట్లు తీయగలిగే వేగవంతమైన బౌలర్లు జట్టుకు అవసరమని తెలిపారు. బలమైన గాలులు వీచే పరిస్థితుల్లో బౌలర్లపై అదనపు ఒత్తిడి ఉంటుందని, అందుకు అనుగుణంగా బౌలింగ్ కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు. **ఏడుగురు బ్యాటర్లతో బరిలోకి**జట్టులో ఏడుగురు ప్రధాన బ్యాటర్లను ఆడించాలని భావిస్తున్నట్లు గిల్ వెల్లడించారు. ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో బ్యాటింగ్ చేయగల బౌలర్లను ఎంపిక చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్ బ్యాటింగ్ చేయగలరని, నితీశ్ కుమార్ రెడ్డి కూడా మంచి బ్యాటర్ అని పేర్కొన్నారు. జట్టు అవసరాలకు అనుగుణంగా తుది కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు. **రిషభ్ పంత్‌కు కెప్టెన్ మద్దతు**వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఫిట్‌నెస్, ఫామ్‌పై వస్తున్న సందేహాలను గిల్ తోసిపుచ్చారు. సుమారు 50 టెస్టులు ఆడిన అనుభవం పంత్‌కు ఉందని, విదేశీ గడ్డలపై కూడా అద్భుతంగా రాణించాడని ప్రశంసించారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో సెంచరీలు సాధించిన పంత్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. **డబ్ల్యూటీసీ ఫైనలే లక్ష్యం** న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల్లోనూ విజయం సాధిస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు మెరుగవుతాయని గిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్‌కు మెరుగైన సన్నద్ధత కల్పించేందుకే వన్డే జట్టు నుంచి కొందరు ఆటగాళ్లను ముందుగానే విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీ20, వన్డే సిరీస్‌లను గెలిచిన భారత్ టెస్టు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుని న్యూజిలాండ్ పర్యటనను ఘనంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



అంతర్జాతీయ స్థాయిలో మను భాకర్‌కు

అరుదైన గుర్తింపు!

- **20262030 కాలానికి ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీలో సభ్యురాలిగా ఎన్నిక**
- **క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం**

న్యూఢిల్లీ: భారత షూటింగ్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు. 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం అధికారికంగా వెల్లడించింది. **22 మంది అభ్యర్థుల నుంచి ఎన్నిక** ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు చెందిన 22 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీపడ్డారు. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురు సభ్యులను క్రీడాకారుల ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఈజిప్టులోని కైరో, ఖతార్‌లోని దోహాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. పిస్టల్ విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ మను భాకర్ ఈ పదవిని దక్కించుకున్నారు. **క్రీడాకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం** తన ఎన్నికపై మను భాకర్ సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన తోటి షూటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారుల సమస్యలు, అవసరాలు సమర్థవంతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పోటీ నిబంధనలు, షెడ్యూళ్లలో స్పష్టత తీసుకురావడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన సహాయక వ్యవస్థలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడం కూడా తన లక్ష్యమని తెలిపారు. **ఒలింపిక్ పతకాలతో ప్రత్యేక గుర్తింపు** 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్వతంత్ర భారత తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. ఆమె ఎన్నికతో అంతర్జాతీయ షూటింగ్ రంగంలో భారత క్రీడాకారుల గొంతుకకు మరింత ప్రాధాన్యత లభించనుంది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ముందు ఆమెకు ఈ బాధ్యత దక్కడం విశేషం.

రాజస్థాన్ రాయల్స్‌లోకి మహ్మద్ షమీ..!

ఐపీఎల్-2027కు ముందే కీలక ఆటగాళ్ల బదిలీ

లఖ్‌నవూతో రాజస్థాన్ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్.. శామ్ కరన్ మరో జట్టుకు



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందే జట్ల మధ్య ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్ల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్‌లో భాగంగా భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరగా, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు మారాడు. వీరితో పాటు స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ కూడా రాజస్థాన్ జట్టులోకి వచ్చాడు. వచ్చే సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో రెండు జట్లు తమ ఆటగాళ్ల బలాబలాలను మార్చుకుంటున్నాయి. **రూ. 8 కోట్లకు షమీ కొనుగోలు** ఈ ఒప్పందంలో ప్రధాన ఆకర్షణ మహ్మద్ షమీ. 35 ఏళ్ల ఈ భారత పేసర్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ. 8 కోట్లకు సొంతం చేసుకుంది. గతంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ షమీని రూ. 10 కోట్లకు తీసుకుంది. తాజా ట్రేడ్ ఒప్పందంలో అతడి ధర రూ. 2 కోట్లు తగ్గింది. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న షమీ రాకతో రాజస్థాన్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.షమీకి కొత్త బంతితో వికెట్లు తీయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేయగలడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంతో పాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం అతడి ప్రత్యేకత. అనుభవజ్ఞుడైన బౌలర్ కావడంతో కీలక సమయాల్లో జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది. **ఐపీఎల్‌లో షమీ ఘన గణాంకాలు** మహ్మద్ షమీ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలో వికెట్లు సాధించడంలో అతడికి మంచి రికార్డు ఉంది. కొత్త బంతితో పాటు పాత బంతితోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం షమీ సొంతం. అతడి అనుభవం రాజస్థాన్ యువ బౌలర్లకు కూడా ఉపయోగపడనుంది. వచ్చే సీజన్‌లో రాజస్థాన్ తరఫున షమీ ఎలా రాణిస్తాడన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. **లఖ్‌నవూకు శామ్ కరన్ అస్త్రం** మరోవైపు రాజస్థాన్ రాయల్స్ నుంచి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌లో చేరాడు. అతడిని రూ. 2.4 కోట్ల ధరతో లఖ్‌నవూ దక్కించుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించగల సామర్థ్యం కరన్ ప్రత్యేకత. అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించడంతో పాటు బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు తీయగలడు.కరన్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 997 పరుగులు చేయడంతో పాటు 59 వికెట్లు సాధించాడు. ఆల్‌రౌండర్‌గా అతడి సేవలు లఖ్‌నవూ జట్టుకు ఉపయోగపడనున్నాయి. జట్టు కూర్పులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలకు సమతుల్యత తీసుకురావడంలో కరన్ కీలకంగా మారే అవకాశముంది.



పాత్ర కోసం జుట్టు కత్తిరించుకున్న సాయి పల్లవి!


- కొత్త లుక్ చూసి షాకైన తల్లి.. వీడియో కాల్ కట్

- విగ్గు పెట్టుకున్నావా అంటూ ఆరా తీసిన తండ్రి

హైదరాబాద్: సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న హీరోయిన్ సాయి పల్లవి తన కొత్త సినిమా కోసం చేసిన సాహసోపేతమైన మార్పు ఆసక్తికరంగా మారింది. ధనుష్ హీరోగా నటిస్తున్న 'ఓం: చాప్టర్ 1 ఉధిరమ్: ది బ్లడ్ వుడ్' సినిమా కోసం ఆమె తన పొడవాటి జుట్టును కత్తిరించుకున్నారు. అయితే సాయి పల్లవి తీసుకున్న ఈ నిర్ణయం ఆమె తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కొత్త లుక్ చూసిన తల్లి షాక్‌కు గురై వీడియో కాల్ కట్ చేశారట. ఈ విషయాన్ని సాయి పల్లవే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.**పాత్ర కోసం పూర్తిగా మారిపోయా** దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని సాయి పల్లవి తెలిపారు. సినిమాలోని పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందులో ఆమె నిత్యారెడ్డి అనే పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం దర్శకుడు నిజ జీవిత ఐపీఎస్ అధికారి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆమె మాదిరిగా చిన్న జుట్టుతో కనిపించాలనే ఉద్దేశంతో సాయి పల్లవి నిజంగానే జుట్టు కత్తిరించుకున్నారు.**తల్లి షాక్.. తండ్రికి అనుమానం**జుట్టు కత్తిరించుకున్న తర్వాత తన కొత్త రూపాన్ని ముందుగా తల్లికి వీడియో కాల్‌లో చూపించానని సాయి పల్లవి చెప్పారు. తనను ఆ రూపంలో చూసిన తల్లి ఒక్కసారిగా ఆశ్చర్యపోయి ఎందుకు జుట్టు కత్తిరించుకున్నావంటూ ప్రశ్నించారని, ఆ తర్వాత ఫోన్ పెట్టేశారని తెలిపారు. అనంతరం తండ్రి ఫోన్ చేసి, పల్లవి.. అది విగ్గు కదా? అని అడిగారని చెప్పారు. తాను నిజంగానే జుట్టు కత్తిరించుకున్నానని, సినిమా పాత్ర కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించానన్నారు. కొత్త రూపానికి అలవాటు పడటానికి తల్లిదండ్రులకు కొంత సమయం పట్టిందని నవ్వుతూ వెల్లడించారు. **నవంబర్ 20న సినిమా విడుదల** రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథలో సాయి పల్లవి పోలీసు అధికారిణిగా కనిపించనున్నారు.

నెట్‌ఫ్లిక్స్‌లో 'రణబాలి' ప్రభంజనం.. విజయ్ నటనకు ప్రేక్షకుల ప్రశంసలు!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చారిత్రక నేపథ్య యాక్షన్ చిత్రం 'రణబాలి' ఓటీటీలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. థియేటర్లలో విడుదలైన తర్వాత మిశ్రమ స్పందన అందుకున్న ఈ చిత్రం.. నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం మరోసారి వార్తల్లో నిలిచింది. నవంబర్ 13 నుంచి తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమాకు వివిధ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది.**టాప్-10 జాబితాలో రెండో స్థానం** నెట్‌ఫ్లిక్స్ ఇండియా సినిమా విభాగంలో 'రణబాలి' రెండో స్థానానికి చేరినట్లు సినీ వర్గాల కథనాలు వెల్లడించాయి. థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో వీక్షిస్తున్నారు. ముఖ్యంగా హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆసక్తి కనిపిస్తుండటంతో సినిమాకు కొత్త ప్రేక్షకులు చేరుతున్నారు. డిజిటల్ విడుదలతో ఈ చిత్రంపై చర్చ మళ్లీ మొదలైంది. **విజయ్ నటనకు ప్రశంసలు** ఈ సినిమాలో విజయ్ దేవరకొండ చేసిన శారీరక మార్పు, కఠినమైన రూపం, ఆవేశభరితమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పాత్రలోని తీవ్రతను తెరపై చూపించిన తీరు అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని 'గాడ్ సీన్' సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. ఆ సన్నివేశంలో విజయ్ ప్రదర్శించిన నటన, తెరపై ఆయన ఉనికి అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు అభిమానులు స్పందిస్తున్నారు. కొందరు ఆయనకు జాతీయ అవార్డు రావాలని కూడా అభిప్రాయపడుతున్నారు. **రష్మిక నటనపైనా చర్చ** ఈ చిత్రంలో జయమ్మ పాత్రలో నటించిన రష్మిక మందన్నకు కూడా మంచి స్పందన లభిస్తోంది. విజయ్, రష్మికల మధ్య తెరపై కనిపించిన అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ప్రధాన జంట నటనతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. **బ్రిటన్‌లోనూ చర్చకు దారితీసిన కథాంశం** బ్రిటిష్ వలస పాలన కాలంలో జరిగిన ఘటనల నేపథ్యంతో రూపొందిన ఈ సినిమా విదేశీ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షిస్తోంది.



పెళ్లి పీటలెక్కిన 'గద్దలకొండ గణేశ్' హీరోయిన్!

- మలేషియాలో ప్రియుడు మహావిష్ణుతో ఏడడుగులు..

- లంకావి దీవిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహ వేడుక



హైదరాబాద్: తెలుగు ప్రేక్షకులకు 'గద్దలకొండ గణేశ్' సినిమాతో దగ్గరైన హీరోయిన్ మృణాళిని రవి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. మలేషియాకు చెందిన ఆధ్యాత్మిక వక్త మహావిష్ణును ఆమె వివాహం చేసుకున్నారు. నవంబర్ 15న మలేషియాలోని లంకావి దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వీరి వివాహం ఘనంగా జరిగింది.**ఏడేళ్ల స్నేహం.. ప్రేమగా మారి** మృణాళిని, మహావిష్ణు మధ్య గత ఏడేళ్లుగా పరిచయం ఉంది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో ఈ ఏడాది ఆగస్టులో తమ ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఇరు కుటుంబాల అంగీకారంతో నిశ్చితార్థం చేసుకున్నారు. తాజాగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలను మృణాళిని సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.**'గద్దలకొండ గణేశ్'తో గుర్తింపు** సోషల్ మీడియా వీడియోల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న మృణాళిని రవి 2019లో విజయ్ సేతుపతి నటించిన 'సూపర్ డీలక్స్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'గద్దలకొండ గణేశ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు', 'మామా మశ్చీంద్ర' చిత్రాల్లో నటించారు. తమిళంలో 'ఎనిమీ', 'ఎంజీఆర్ మగన్', 'జాంగో', 'కోబ్రా', 'రోమియో' వంటి సినిమాలతో గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆమె పెళ్లి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ఎన్టీఆర్ అభిమానులకు డబుల్ ధమాకా!



ఒకేసారి రెండు సినిమాలతో తారక్ సందడి.. ప్రశాంత్ నీల్, త్రివిక్రమ్, అనిల్ రావిపూడితో భారీ ప్రాజెక్టులు

హైదరాబాద్: మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు వరుస శుభవార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్న తారక్ మరో క్రేజీ ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన ఆయన, ఆ తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించనున్నారు. ఇదే సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడితోనూ కొత్త సినిమా ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది.**ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్'** ప్రస్తుతం ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' చిత్రం రూపొందుతోంది. భారీ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం విడుదలకు సిద్ధం కానుంది.**త్రివిక్రమ్‌తో 'గాడ్ ఆఫ్ వార్'** 'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు ప్రచారంలో ఉంది. జూలై నుంచి ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ కథా నేపథ్యంతో రూపొందనున్న ఈ చిత్రంపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అయితే సినిమా షూటింగ్ తేదీలు, ఇతర నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.**అనిల్ రావిపూడితో మరో సినిమా** మరోవైపు ఎన్టీఆర్, అనిల్ రావిపూడి కలయికలో సినిమా ఉంటుందని అధికారికంగా ప్రకటించడం అభిమానులకు మరో కానుకగా మారింది.

గ్రామీ నామినేషన్లలో 'ధురంధర్'కు నిరాశ!



రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్: ది రివెంజ్ చిత్రానికి 2027 గ్రామీ అవార్డుల్లో నిరాశ ఎదురైంది. ఈ సినిమా నుంచి సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ రూపొందించిన పాటలను ఎనిమిది విభాగాల్లో పరిశీలనకు పంపినప్పటికీ, తుది నామినేషన్లలో ఒక్కదానికి కూడా చోటు దక్కలేదు.'ఫిర్ సే', 'జైయే సజనా', 'జాన్ సే గుజర్తే హై', 'కన్హయ్యా', 'ఆరి ఆరి', 'మన్ అట్కేయా' వంటి పాటలు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. దేశంలో మంచి ఆదరణ పొందిన ఈ పాటలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని చిత్ర బృందం ఆశించినా ఫలితం దక్కలేదు.అయితే, భారతీయ సంగీతానికి గ్రామీ వేదికపై ప్రాతినిధ్యం లభించింది. దేవన్ ఏకాంబరం, సుషా ఆలపించిన తమిళ గీతం 'పరువాయ్' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ విభాగంలో నామినేషన్ సాధించింది. గ్రామీ చరిత్రలో ఓ తమిళ పాటకు నామినేషన్ దక్కడం ఇదే తొలిసారి. 2027 గ్రామీ నామినేషన్లలో బ్రిటిష్ గాయని రే 11 నామినేషన్లతో ముందుండగా, బియాన్స్ తన కెరీర్‌లో 100 గ్రామీ నామినేషన్లు పొందిన తొలి కళాకారిణిగా చరిత్ర సృష్టించింది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.